చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు

- ఇష్టారీతిన నాటిన హరితహారం చెట్లతో విద్యుత్ అధికారులకు ఇబ్బందులు
- ఈదురుగాలులు వీచిన ప్రతిసారి కరెంట్ సరఫరాకు అంతరాయం



విద్యుత్ తీగల మధ్యలోకి పెరిగిన చెట్లు



విద్యుత్ తీగలకు అల్లుకున్న చెట్లు

సూర్యాపేట అర్బన్ : హరితహారంలో భాగంగా కొన్నిప్రాంతాల్లో హడావుడిగా ఇష్టారీతిన మొక్కలను నాటారు. అయితే ఆ మొక్కలు ఇప్పుడు పెద్ద వృక్షాలుగా మారి విద్యుత్ అధికారులకు ఇబ్బందిగా మారాయి. సూర్యాపేట పట్టణంలోని ఏ వీధిలో చూసిన ఇళ్ల ముందు, షాపుల ముందు హరితహారం మొక్కలు నాటారు. ఆ చెట్లను సంరక్షించడంలో మున్సిపల్ సిబ్బంది ఎన్నో వ్యయప్రయాసలు పడ్డారు. ఎండాకాలంలో కూడా ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసి చెట్లను బతికించారు. కానీ ఆ మొక్కలను నాటేటప్పుడు అధికారులు పైన కరెంట్ తీగలు ఉన్నాయని కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో ఇప్పుడు హరితహారం చెట్లే విద్యుత్ అధికారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి.

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

చెట్లు పెరిగి తీగల మధ్యలోకి వెళ్లడంతో విద్యుత్ సరఫరాలో నిరంతరం సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈదురుగాలులు వీచినప్పుడు చెట్లు ఊగడంతో కరెంట్ తీగలు తెగిపడుతున్నాయి. పలుప్రాంతాల్లో షార్ట్‌సర్క్యూట్ అవుతూ ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. దీంతో పట్టణ విద్యుత్ వినియోగదారులు, వ్యాపారస్తులు, చిన్న చిన్న కుటీర పరిశ్రమల వారు, హాస్పిటల్స్ వారు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సుమారు 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేసి చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని పట్టణవాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

అసలే వేసవికాలం, దానికి తోడు విద్యుత్ సరఫరాను గంటల కొద్ది నిలిపివేస్తుండడంతో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏ పని చేయాలన్నా విద్యుత్ వినియోగం అవసరం అవుతుంది. కావున అధికారులు స్పందించి విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలి.
– యాతాకులు రాజయ్య, పీఎస్‌ఆర్ సెంటర్



చెట్ల కొమ్మలను తొలగిస్తున్నాం

విద్యుత్ లైన్ల కింద చెట్లను నాటడం వల్ల విద్యుత్‌ను సరఫరా చేయడంలో ఇబ్బంది అవుతోంది. విద్యుత్ తీగలకు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలను ప్రతి నాలుగు నెలలకు ఒకసారి తొలగిస్తున్నాం. ప్రతి లైన్‌మెన్‌కు సుమారు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చవుతున్నాయి.
– సురేష్, ఏఈ, సూర్యాపేట టౌన్–1

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



ముఖ్యమంత్రితో మందుల సామేల్

తిరుమలగిరి : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని శనివారం ఎమ్మెల్యే మందుల సామేల్ కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ గవర్నర్ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపిన సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో సన్మానించారు.

హైకోర్టు న్యాయవాది ప్రసాద్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సగరపు ప్రసాద్

సూర్యాపేటటౌన్ : తెలంగాణ హైకోర్టు న్యాయవాది సగరపు ప్రసాద్ శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లీగల్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పూర్తిచేయడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఫణిగిరి వాసికి ఆర్ట్ జర్నల్ అవార్డు



మాజీ సీజేఐ ఎన్వీ రమణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆనంద్

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, ఆర్టిస్ట్ శిరంశెట్టి ఆనంద్‌కు ఆర్ట్ జర్నల్‌లో నగదు పురస్కారం, అవార్డు లభించింది. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో టీజేఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చేతుల మీదుగా నగదు పురస్కారం, అవార్డు అందుకున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

చివ్వెంల : రాజీవ్ యువ వికాసం పథకానికి మహిళలు అధికసంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో వీఓలు సమభావన సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

భానుపురి : సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వడ్డే ఎల్లయ్య కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పోతు భాస్కర్‌లు అందించిన రూ.లక్షన్నర ఆర్థికసాయాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి నాగుల వాసు, జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ యలగందుల సాయి నేత పాల్గొన్నారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూర్(ఎస్) మండలం మక్తా కొత్తగూడెం గ్రామంలోని రేషన్ డీలర్ శ్రీనివాస్‌రెడ్డిని సివిల్ సప్లై అధికారులు సస్పెండ్ చేశారు. కొంతకాలంగా రేషన్ బియ్యం పంపిణీలో శ్రీనివాస్‌రెడ్డి అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఈ నెల 7న జిల్లా కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేయగా.. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి శుక్రవారం గ్రామంలోని రేషన్ షాపును తనిఖీ చేసి విచారణ చేపట్టారు. సుమారు మూడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం పంపిణీలో తేడా రావడంతో డీలర్‌పై కేసు నమోదు చేసి సస్పెండ్ చేసినట్లు ఆమె తెలిపారు. రేషన్ డీలర్ శ్రీనివాస్‌రెడ్డి అందుబాటులో లేనందున ఇన్‌చార్జి బాధ్యతలు ఇతరులకు ఎవరికి ఇవ్వలేదని పేర్కొన్నారు.

పండుగలా నిర్వహించాలి

తిరుమలగిరి: అంబేద్కర్ జయంతిని పండుగలా జరుపుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. శనివారం తిరుమలగిరిలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ నాయకులంతా ఈ నెల 13న అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని కోరారు. 14న దసరా, దీపావళి పండుగల్లా జయంతి వేడుకలను జరుపుకోవాలన్నారు.

హామీలు నెరవేర్చడంలో విఫలం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ వికలాంగుల హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం ఖాసిం అన్నారు. సూర్యాపేట పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చింత సతీష్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. వికలాంగులకు రూ.6000 పింఛన్ ఇవ్వాలని, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక సంస్థలలో 7శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు కార్ల విజయరావు, మహిళా రాష్ట్ర నాయకురాలు రావి స్నేహలత చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా, జిల్లా ఉపాధ్యక్షుడు చింత సాంబయ్య, జిల్లా కార్యదర్శి మిద్దె సైదులు, జిల్లా సీనియర్ నాయకులు తిప్పర్తి భిక్షం, నూకపంగు గురవయ్య, నాయకులు ములకలపల్లి సైదులు, ఇంద్రపెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సోనోవిజన్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న జనార్దనమూర్తి

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో శనివారం సోనోవిజన్ షోరూంను సోనోవిజన్ ఫౌండర్, చైర్మన్ పొట్లూరి జనార్దనమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోనోవిజన్ షోరూంలో ఏసీలు, ఎయిర్ కూలర్స్, రిఫ్రిజిరేటర్స్, ఎల్ఈడీ టీవీలు, మొబైల్స్, ల్యాప్‌టాప్స్, వాషింగ్ మెషిన్స్, కిచెన్ అప్లయన్సెస్ లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కరమూర్తి, స్టోర్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో గల మద్దిరాల ఎక్స్‌రోడ్డు, కుంటపల్లి గ్రామాలకు, అదే విధంగా నూతనకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోలుమల్ల గ్రామానికి ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

నూతనకల్ : మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



తుంగతుర్తి : గొట్టిపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తుంగతుర్తి : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ అన్నారు. శనివారం గొట్టిపర్తి, బాపన్‌బావితండా, రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండా, ఏనెకుంటతండాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జై సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్, పెద్దబోయిన అజయ్‌కుమార్, కొండ రాజు పాల్గొన్నారు.

నాగారం : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నుతోందని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల కోఆర్డినేటర్ పానుగంటి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం వర్ధమానుకోటలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, పాశం యాదవరెడ్డి, పసుపులేటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



నాగారం : వర్ధమానుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల అడ్డగింత

ఆత్మకూరు(ఎస్) : అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను అధికారులు అడ్డుకున్నారు. మండల పరిధిలోని నెమ్మికల్ చౌటచెరువులో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన కొందరు సమీపంలోని కోటి నాయక్ తండా, ఐలాపురం ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఇరిగేషన్ అధికారులు శనివారం అక్కడకు చేరుకొని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.

వక్ఫ్ బిల్లు చట్టంపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు చట్టాన్ని ఆపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌డీ.ఫయాజ్‌మియా డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరిలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అశోక్, జంపాల శ్రీను, మల్లయ్య, జబ్బార్, సలీమ్, అబ్బాస్, షకీల్, సాధిక్, ఖలీమ్, జాహెద్‌అలీ, జహీర్, బాబర్, సయ్యద్‌పాషా, రెహమాన్, హఫీజ్ పాల్గొన్నారు.

గోదావరి జలాలు విడుదల

అర్వపల్లి : జనగామ జిల్లా బయ్యన్నవాగుకు గోదావరి జలాలు వెళ్లే కాల్వ యూటీకి మరమ్మతులు చేపట్టేందుకు గానూ బ్యాక్‌వాటర్ తగ్గించడం కోసం శనివారం సూర్యాపేట జిల్లాకు నీటిని వదిలారు. దీంతో సుమారు 597 క్యూసెక్కుల నీళ్లు జిల్లాకు వస్తున్నాయి. ఒకటి రెండు రోజులపాటు బ్యాక్ వాటర్‌ను తగ్గించి యూటీ మరమ్మతు చేపట్టనున్నట్లు నీటి పారుదలశాఖ డీఈఈ సత్యనారాయణ తెలిపారు. గోదావరి జలాలను చెరువులు, కుంటలకు మళ్లించుకోవాలని రైతులకు సూచించారు.

సుదర్శన సహిత లక్ష్మీనర్సింహస్వామి హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : విశ్వావసు నామ సంవత్సరం చైత్ర పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం సుదర్శన సహిత శ్రీలక్ష్మీనర్సింహస్వామి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కిరణ్ కుమార చార్యులు, కృష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్, బండకవి క్రిష్ణమోహన్, మధుసూదన్‌రావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అర్వపల్లి : సూర్యనాయక్‌తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీ గణేష్



నాగారం : నర్సింహులగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీ కృష్ణకాంత్

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యనాయక్‌తండాలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఏపీ పి.గణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఏఈఓ నేరెళ్ల సత్యం, మాజీ సర్పంచ్ లూనావత్ స్వాతిరవీందర్‌నాయక్, సీసీ నగేష్, నిర్వాహకులు, గిరిజనులు పాల్గొన్నారు.

నాగారం : రైతులు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణకాంత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నర్సింహులగూడెంలో గ్రామీణ్ ఆగ్రో ఎఫ్‌పీఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఏఈఓ సంధ్య, ఎఫ్‌పీసీ చైర్మన్ కోడికంటి వెంకన్న, కాటి ఆంజనేయులు, పద్మ, చిత్తలూరి వెంకన్న, చిత్తలూరి ఎల్లయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.ప్రమీల అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నాగారంబంగ్లా–1 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హరిత, ఆయా, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : పర్సాయపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం పోషణ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన జరిపారు. పౌష్టికాహార ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కొప్పుల ప్రభావతి, సవిత, ఆయాలు సత్తమ్మ, వెంకటమ్మ, ఆశాలు రాంబాయి, జానకమ్మ పాల్గొన్నారు.

మద్దిరాల : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ గుర్వోజు రమాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ పోషణ్ పక్వాడ్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మన చుట్టూ ఉన్న పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఏఎస్‌ఎం పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, అన్నపూర్ణ, అంజలి, ఆశాలు కె.విజయలక్ష్మి, ఎస్.లింగమ్మ, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలలు పాల్గొన్నారు.

'మా భూమి రథయాత్ర' కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ధర్మసమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ చేస్తున్న మా భూమి రథయాత్ర కరపత్రాన్ని శనివారం తిరుమలగిరిలోని పూలే చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు పేరాల శ్రీనివాస్ మహరాజ్ మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న ఆదిలాబాద్‌లోని డైట్ కాలేజ్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యే సభకు మండల కేంద్రం నుంచి వివిధ ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ, ఎస్టీ, జేఏసీ సభ్యులు జనగం సోమయ్య, నను బాల మల్లయ్య యాదవ్, చారి, బుషిపాక సైదులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు 15 మంది విద్యార్థులు ఎంపిక

తుంగతుర్తి : ఐదవ తరగతి ప్రవేశానికి ప్రకటించిన గురుకుల ఫలితాల్లో వెంపటి ప్రాథమిక పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వెంకట్రామనర్సమ్మ తెలిపారు. శనివారం పాఠశాలలో గురుకులాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు కష్టపడి చదివితే విజయం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలకుర్తి ఎల్లయ్య, మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, బండారు భవాని, నిమ్మనబోయిన నవీన, జీడి అనిల్‌కుమార్, మిట్టగడుపుల విక్రం, ఇండ్ల ఆంజనేయులు, మాలోతు కృష్ణ, శీలోజు రమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వెంపటి ప్రాథమిక పాఠశాలలో గురుకులాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



తాళ్లగడ్డ (సూర్యాపేట) : బర్లపెంట బజారులోని హనుమాన్ ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



తాళ్లగడ్డ (సూర్యాపేట) : హనుమాన్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



తిరుమలగిరిలో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు


తాళ్లగడ్డ (సూర్యాపేట) : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని బర్లపెంట బజార్‌లో గల హనుమాన్ ఆలయంలో శనివారం అర్చకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నిర్వహించిన పంచామృత అభిషేకం, తమలపాకుల అర్చన తదితర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర


సూర్యాపేట పట్టణంలో శనివారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించి, అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. బర్లపెంట బజారులోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీరామ్‌నగర్‌లోని శ్రీ విజయాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో శనివారం తిరుమలగిరిలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గణేష్ ఆలయం నుంచి స్థానిక ఎక్స్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో వై.దీన్‌దయాళ్, ఎం.రాములు, సుధాకర్, గోవర్ధన్, రూపని వెంకన్న, హన్మంతరావు, శ్రీనివాస్, రమేష్, బుక్కా శ్రీనివాస్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భజనలు, ర్యాలీలు నిర్వహించారు.



తాళ్లగడ్డ (సూర్యాపేట) : శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



తాళ్లగడ్డ (సూర్యాపేట) : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ప్రమాదవశాత్తు గడ్డి దగ్ధం

చివ్వెంల: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన హాలవత్ తండాలో శనివారం రాత్రి జరిగింది. తండాకు చెందిన హాలవత్ హరిశ్చంద్రు తన వ్యవసాయ కొట్టం వద్ద సుమారు 200 మోపుల గడ్డివామును ఉంచాడు. అయితే శనివారం రాత్రి ఒక్కసారిగా గడ్డివాముకు నిప్పంటుకుని మంటలు లేచాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకొని మంటలను చల్లార్చారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో శనివారం విద్యుద్ షార్ట్ సర్క్యూట్ వల్ల గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన గొట్టిముక్కల శ్రీనివాస్‌రెడ్డి ట్రాక్టర్‌పై గడ్డిని తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి గడ్డికి మంటలు అలుముకున్నాయి. ట్రాక్టర్ డ్రైవర్ హైడ్రాలిక్ లేపి గడ్డిని పడవేశాడు. ట్రాక్టర్‌కు నిప్పులు అంటుకోకుండా గడ్డి పూర్తిగా కాలిపోయింది.

గీత కార్మికుడికి గాయాలు

మద్దిరాల: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన పోలుమల్ల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాసాగాని పాపయ్య కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా.. ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.